ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.2 ; కనిష్ఠం 23.8



'నాగమడుగు' పనుల పరిశీలన

నిజాంసాగర్, జూన్ 23: మండలంలోని వడ్డేపల్లి సమీపంలో కొనసాగుతున్న నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను జుక్కల్ శాసన సభ్యుడు తోట లక్ష్మీకాంత్‌రావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. రూ.475 కోట్లతో నిర్మిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాగమడుగు నిర్మాణంతో ఈ ప్రాంత రైతుల భూములకు సాగునీరు అందుతుందన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు, స్థానిక నాయకులు తదితరులున్నారు.



త్వరలో రైతులకు.. రుణమాఫీ!

కామారెడ్డి, జూన్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు రైతుల రుణమాఫీపై తుది నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15 వరకు రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించింది. త్వరలోనే రైతు రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఎన్నికల మేనిఫేస్టోలో ఇచ్చిన హామీ మేరకు రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 15లోగా ఖచ్చితంగా రూ.2లక్షల లోపు పంట రుణాలన్నింటిని మాఫీ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. రుణమాఫీనే ఎజెండాగా రెండు రోజుల క్రితం క్యాబినెట్ సమావేశం సైతం నిర్వహించి రుణమాఫీకి మంత్రి వర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో రుణమాఫీపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తే జిల్లాలో సుమారు 2 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

ఏళ్లుగా ఎదురు చూపులు

గత ప్రభుత్వం రూ.1లక్షలోపు రైతు రుణమాఫీ చేసింది. కానీ విడతల వారీగా చేపట్టడంతో రుణమాఫీ ఎప్పుడవుతుందా అని రైతులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఇందులోనూ కొందరికి ఇంకా మాఫీ కాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. గతంలో రుణమాఫీ కాకపోవడం చెల్లించే పరిస్థితుల్లో లేకపోవడంతో పలువురు రైతులకు బ్యాంకుల నుంచి నోటీసులు వచ్చాయి. ఇక కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనే రూ.2లక్షల రుణమాఫీని ఏక కాలంలో చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు పలు పథకాలు ప్రకటించిన గత డిసెంబరు 9నే రుణమాఫీ కూడా చేస్తుందని రైతాంగం అంతా భావించింది. కానీ భారీ బడ్జెట్‌తో కూడుకొని ఉండడంతో కొత్త సర్కార్ సమయం తీసుకుంది. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15లోపు రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని మళ్లీ హామీ ఇచ్చారు. ఈ ప్రకారం రెండు రోజుల క్రితం రాష్ట్ర క్యాబినెట్ దీనిపై నిర్ణయం తీసుకుంది.

కటాఫ్ తేదీలోపు తీసుకున్న వారికే రుణమాఫీ వర్తింపు

ప్రస్తుత సీజన్ నేపథ్యంలో రైతు సంక్షేమ చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి చర్చించింది. ప్రధానంగా పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం చేసిన రైతు రుణమాఫీపై కీలక నిర్ణయం తీసు కుంది. అసెంబ్లీ, పార్లమెం ట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల వరకు పంటల రుణమాఫీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2023 డిసెంబరు 9ని కటాఫ్ తేదీగా నిర్ణయించింది. ఆ తేదీ వరకు రూ.2లక్షలలోపు తీసుకున్న రుణాలకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తున్నట్లు పేర్కొంది. అది కూడా ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లే ఆగస్టు 15లోపు హామీ పూర్తి చేయనుంది. అయితే జూలై నుంచే రైతుల రుణమాఫీని విడుతల వారీగా చేయనున్నట్లు తెలుస్తోంది.

- రూ.2లక్షల వరకు రుణమాఫీకి మంత్రి వర్గం గ్రీన్‌సిగ్నల్
- 2023 డిసెంబరు 9 వరకు కటాఫ్ తేది
- జూలై నుంచి రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో సుమారు 2 లక్షల మందికిపైగా రైతులకు లబ్ధిచేకూరే అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు

ఏక కాలంలోమాఫీ

జిల్లాలో 5.38 లక్షల ఎకరాలల్లో సాగు భూమి ఉండగా 3.34 లక్షల మంది రైతులు ఉన్నారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు ఎంతో కొంత పంట రుణాలు తీసుకున్నారు. చాలా మంది అసలు కట్టలేని పరిస్థితుల్లో ఏటా వడ్డీలు కట్టుకుంటూ రుణాన్ని రెన్యువల్ చేయించుకుంటున్నారు. అలా తీసుకున్న రుణానికి వడ్డీ కడుతున్నా ఏడాదికేడాది అసలు మాత్రం పెరుగుతూ పోతోంది. రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు చేరిన రైతులకు ఇప్పుడు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. తాము ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షలలోపు రుణాలను మాఫీ చేసేందుకు నిర్ణయించింది. అదికూడా ఏక కాలంలో ఈ మొత్తాన్ని మాఫీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సుమారు 2లక్షలకు పైగా మంది రైతులకు లబ్ధి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా మాఫీ చేయని రుణాలతో పాటుగా ఇప్పటి వరకు సుమారు 2లక్షల మందికి పైగా రైతులు వివిధ బ్యాంకులకు పంట రుణాలను చెల్లించాల్సి ఉంది. సుమారు రూ.3500కోట్ల మేర పంట రుణాలు బాకీ పడినట్లు సంబంధిత శాఖధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.2లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో సుమారు 2లక్షల వరకు రైతుల రుణమాఫీ పొందే అవకాశం ఉంది. ఈ రుణాలను ప్రభుత్వమే టెకోవర్ చేసుకుని పంట రుణాలకు విడతల వారీగా బ్యాంక్‌లకు ప్రభుత్వమే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తోట లక్ష్మీకాంత్‌రావు

నిజాంసాగర్, జూన్ 23: వానా కాలం పంటల కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 1932లో నిజాంసాగర్ ప్రాజెక్టును నిర్మించారన్నారు. గత ఏడాది మాదిరి ఈ సంవత్సరం కూడా జూన్ నెలలోనే నీరు విడుదల చేయాలని రైతులు కోరారన్నారు. రాష్ట్రంలోనే మొదటగా ఈ ప్రాంతంలోనే రైతులు రోహిణి కార్తెలోనే నారు పోసి త్వరగా నాట్లు వేస్తారన్నారు. ఒకవేళ సమయానికి వర్షాలు కురియకపోతే ప్రాజెక్టులోకి నీరు రాకపోతే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి 2 టీఎంసీల నీరు తీసుకుని వచ్చే అవకాశముందన్నారు. వర్షాకాలంలో కొంత మేలు జరుగుతుందన్నారు. నీటిని విడతల వారీగా విడుదల చేస్తామని, ఆదివారం నుంచి 1400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారన్నారు. రైతులు అవసరానికి అనుగుణంగా పొదుపుగా వాడుకోవాలన్నారు. గత ఏడాది యాసంగిలో నీటి విడుదల క్రమబద్ధీకరణ చేసి పొదుపుగా వాడటంతో ప్రస్తుత వానాకాలం సాగుకు నీళ్లు మిగిలాయన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు రైతుల తరపున ధన్యవాదాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫెదార్ శోభ, ఎంపీపీ జ్యోతి, వైస్ ఎంపీపీ మనోహర్, సీఈ శ్రీనివాస్, ఈఈ సోలోమాన్, బాన్సువాడ ఎస్ఈ వాసంతి, డిప్యూటీ ఈఈ రాజశేఖర్, అధికారులు, నియోజకవర్గంలోని జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, తదితరులున్నారు.

రేషన్ కోటాలో ఎంతైనా డీడీలు కట్టుకోవచ్చు

- తాడ్వాయి మండల రేషన్ డీలర్ల సంఘం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాడ్వాయి, జూన్ 23: మండలంలోని రేషన్ డీలర్లు తమ కోట కంటే ఎంత ఎక్కువైనా డీడీలు కట్టుకోవచ్చని మండల రేషన్ డీలర్ల సంఘం ఆదివారం తీర్మానించింది. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రేషన్‌కోటాలో ఎక్కువ డీడీలు కడితే జరిమానా' అనే వార్తకు రెవెన్యూ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పందించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా డీలర్లు పని చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో రేషన్ డీలర్ల సంఘం నాయకులు వెంటనే తాడ్వాయి రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రేషన్ కోటాలో ఎంతైనా డీడీలు చెల్లించుకోవచ్చని తీర్మానం చేశారు. బతుకుదెరువు కోసం వచ్చిన వలస కూలీలకు ఏ రేషన్‌షాపులోనైన బియ్యం తీసుకోవచ్చని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రేషన్‌డీలర్ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజు, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు అంజనేయులు, కార్యదర్శి నరహరి పాల్గొన్నారు.

మళ్లీ వసూళ్లు షురూ..!

- జంగంపల్లి శివారులోని ఆర్టీఏ చెక్ పాయింట్‌ల వద్ద ఇష్టారీతిగా డబ్బుల వసూళ్లు
- రాష్ట్రవ్యాప్తంగా చెక్ పోస్టులపై ఏసీబీ దాడులతో కొద్ది రోజులు వసూళ్లకు బ్రేక్
- ఈ చెక్ పాయింట్‌పై సైతం ఏసీబీ దాడులు చేయాలని విన్నపం

భిక్కనూరు, జూన్ 23: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఏ చెక్ పోస్టులపై ఏక కాలంలో ఏసీబీ అధికారులు గత కొన్ని రోజుల క్రితం దాడులు చేయడంతో భిక్కనూరు మండలంలోని జంగంపల్లి శివారులో 44వ జాతీయ రహదారిపై గల ఆర్టీఏ చెక్ పాయింట్‌లపై సైతం దాడులు జరుగవచ్చన్న ఉద్దేశ్యంతో అక్కడ గత కొంతకాలంగా వాహనదారుల నుంచి డబ్బుల వసూళ్లను నిలిపివేశారు. చాలా చోట్ల ఏసీబీ దాడులు జరిగినప్పటికీ జంగంపల్లి శివారులోని ఆర్టీఏ చెక్ పాయింట్‌లపై మాత్రం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించలేదు. దీంతో చెక్ పాయింట్‌ల వద్ద మళ్లీ వాహనదారుల నుంచి డబ్బుల వసూళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ దాడులు జరుగుతున్న, వార్త పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చినా జంగంపల్లి ఆర్టీఏ చెక్‌పాయింట్ వద్ద మాత్రం పరిస్థితి మారడం లేదు. రాష్ట్రంలో ఎక్కడైనా ఏసీబీ దాడులు జరిగితే రెండు, మూడు రోజులు వాహనదారుల నుంచి వసూళ్లను ఆపడం, అనంతరం మరల ప్రారంభించడం చేస్తున్నారు. అంతట ఏసీబీ దాడులు చేస్తున్నా ఈ ఆర్టీఏ చెక్ పాయింట్‌లపై ఏసీబీ అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదని, ఈ చెక్ పాయింట్‌ల వద్ద వసూళ్ల కార్యక్రమం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుందని ఏసీబీ అధికారులు ఈ చెక్ పాయింట్‌లపై దృష్టి సారించాలని వాహనదారులు పలువురు కోరుతున్న పరిస్థితి ఉంది.

ఆర్టీఏ చెక్ పాయింట్‌ల వద్ద ఇష్టారీతిగా డబ్బుల వసూళ్లు

జంగంపల్లి శివారులోని ఆర్టీఏ చెక్ పాయింట్ వద్ద వాహనదారుల నుంచి ఒక్కో వాహనానికి ఒక్కో విధంగా సిబ్బంది డబ్బులు వసూళ్ల చేస్తున్నట్లు చాలా రోజులుగా ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వకుంటే ఏవేవో కారణాలతో అక్కడి సిబ్బంది ఇబ్బంది పెడతారని, ఆ ఇబ్బందులు పడకుండా సమయానికి లోడ్ డెలివరీ చేయాలంటే డబ్బులు చెల్లించక తప్పదన్న ఉద్దేశ్యంతో డబ్బులు ఇస్తున్నామని కొందరు ఇతర రాష్ట్రాల వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే అప్పుడప్పుడు ఇక్కడి ప్రైవేటు సిబ్బంది కొడతారని ఆరోపిస్తున్నారు.

జంగంపల్లిలో ఏసీబీ దాడులు చేయాలని విన్నపం

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఏ చెక్‌పోస్టులపై ఏసీబీ అధికారులు దాడులు చేసినప్పటికీ జంగంపల్లి శివారులోని ఆర్టీఏ చెక్ పాయింట్‌లపై ఎందుకు దాడులు చేయలేదో అర్థం కావడం లేదని, ఈ చెక్ పాయింట్‌లపై సైతం దృష్టి సారించి ఒక్కసారిగా దాడులు చేయాలని పలువురు వాహనదారులు, కార్మిక సంఘం నాయకులు కోరుతున్నారు.

మోయలేని భారం

- ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోత
- ఆదాయంలో 40 శాతం చదువులకే ఖర్చు
- అమలుకాని ఫీజుల నియంత్రణ
- విద్యాహక్కు చట్టానికి తూట్లు
- పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులకు ఆర్థిక ఇక్కట్లు

కామారెడ్డి టౌన్/బాన్సువాడ టౌన్, జూన్ 23: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, పేద విద్యార్థులకు కార్పోరేట్ విద్య, విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేకంగా విద్యాహక్కు చట్టం వచ్చినా ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలు ఈ చట్టాన్ని బేఖాతారు చేస్తున్నాయి. ఫీజులను అడ్డగోలుగా పెంచేస్తున్నా విద్యాధికారులు పట్టించుకోవడం లేదు. విద్యార్థుల కోసమే తాము పని చేస్తామని చెబుతున్నా విద్యార్థి సంఘాలు సైతం పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో ప్రైవేట్ పాఠశాలలు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా పుస్తకాలకు, దుస్తులకు వసూళ్ల చేస్తుండడంతో పాటు ప్రీ ప్రైమరీ పాఠశాలలకే రూ.25 వేల నుంచి రూ.65 వేల వరకు ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం రోజురోజుకూ అధికమవుతుంది. పోని విద్యాశాఖాధికారులైన సరైన దృష్టి సారిస్తున్నారంటే అదీ లేదు. దీంతో ఇష్టారీతిన ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చేస్తున్నాయి.

జీవో 91 కాగితాలకే పరిమితం


ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం జీవో నెం. 91ని జారీ చేసి ఏళ్లు గడుస్తున్నా జిల్లాలో నియంత్రణ కొరవడింది. దీని ప్రకారం రెండు కేటగిరీల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాలను వేరు చేస్తు రూ.8 వేలు, రూ.12 వేల ఫీజులుగా నిర్ణయించారు. కానీ ఈ ఫీజులను జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు పట్టించుకోవడం లేదు. రోజు కూలి నుంచి ఉన్నత ఉద్యోగుల దాకా తమ పిల్లలను పేరున్న ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలని తపనపడటం సహజం. తల్లిదండ్రుల ఆరాటాన్ని యజమాన్యాలు సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఫీజుల మోత పది రేట్లు పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే 20 శాతం నుంచి 30 శాతం పెంచేశారు. విద్యార్థుల ఇబ్బందులు తొలగించేందుకు తాము అండగా నిలుస్తామని పలు సందర్భాల్లో పేర్కొంటున్నా కొన్ని విద్యార్థి సంఘాలు ప్రైవేట్ యాజమాన్యాలు, కొందరు విద్యాశాఖధికారుల కనుసన్నల్లో పని చేస్తూ వారు ఇచ్చింది పుచ్చుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు అడ్డగోలు ఫీజులు వసూలు చేస్తే విద్యార్థి సంఘాల నాయకులు, విద్యాశాఖధికారుల దృష్టిలో పడితే ఇబ్బందులు పడుతామని భయం ఉండేది. కానీ ఇప్పుడు విద్యార్థి సంఘాలలో కొందరు నాయకులు డబ్బుల కోసమే అన్నట్లుగా పని చేస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందులను తీర్చేవారే కరవయ్యారు. ఆదాయంలో 40 శాతం పిల్లల చదువులకే ఖర్చు అవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

ఉచిత సీట్ల కేటాయింపు ఏదీ?

పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లను జిల్లాలోని ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాల కేటాయించడం లేదు. ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి పాఠశాలలు బహిరంగంగానే అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తున్నాయి. ఇది నిబంధనలకు విరుద్ధమైనా అడిగే వారే లేరు. పాఠశాల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, క్రీడలు, పరీక్ష ఫీజు, సాంస్కృతిక కార్యక్రమాల పేరిట యాజమాన్యాలు ఇష్టా రాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇంత వరకు అధికారుల ఆధ్వర్యంలోని కమిటీ కూర్చోని చర్చించకపోవడం గమనార్హం. ప్రైవేట్ బడుల్లో తప్పని సరిగా డీఈడీ, బీఈడీ ఆపై చదువులు చదివిన వారినే ఉపాధ్యాయులుగా నియమించాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగు నీటి సౌకర్యాలు కల్పించాలి. చాలా వరకు ఈ నిబంధనలు ఏ పాఠశాలల్లోనూ లేవు.

నర్సరీకి రూ.15 వేల నుంచి రూ.25 వేలు

పాఠశాల స్థాయిని బట్టి విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేస్తున్నారు. ప్రాధాన్యత తక్కువ ఉన్న పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీకి రూ.10వేలు, ఓ మోస్తారు పాఠశాలల్లో రూ.12 వేలు డిమాండ్ అధికంగా ఉన్న పాఠశాలల్లో 15వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు రూ.40వేల పైనే తప్ప తక్కువ లేదు. ఇక యూనిఫాం, దుస్తులు, పుస్తకాలు, షూస్, టై, బెల్టులు కమీషన్ ఇచ్చే దుకాణాలల్లో లేదంటే నేరుగా పాఠశాలల్లోనే అమ్మకాలు జరుపుతున్నారు. పాఠశాల పేర్లతో ముద్రించినవి కావడంతో తల్లిదండ్రులు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.



ఆరేళ్లుగా నిలిచిన పాఠశాల పనులకు మోక్షం!

● ఎట్టకేలకు ఎస్టీ గురుకుల పాఠశాల నిర్మాణం పనులు పునఃప్రారంభం



మొదలైన గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు

నాగిరెడ్డిపేట, జూన్ 23: మండలానికి మంజూరైన గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణం పనులకు మోక్షం లభించింది. సుమారు గత ఆరేళ్లుగా వివిధ అడ్డంకుల కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణ పనులు, అడ్డంకులు తొలగిపోవడంతో ఇటీవలే నిర్మాణం పనులు తిరిగి పునఃప్రారంభమయ్యాయి. నాగిరెడ్డిపేట మండలానికి 2016లో గిరిజన గురుకుల బాలుర పాఠశాల మంజూరైంది. పాఠశాల మంజూరు అయినప్పుడు మండల కేంద్రంలోని ఓ అద్దె భవనంలో పాఠశాలను తాత్కాలికంగా ప్రారంభించి కొనసాగించారు. 2017లో ఈ పాఠశాలకు నాలుగు కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో అప్పటి తెలంగాణ ప్రభుత్వం సొంతభవనాన్ని మంజూరు చేసింది. పాఠశాల భవన నిర్మాణం కోసం మండల కేంద్రంలో హైదరాబాద్-బోధన్ ప్రధాన రహదారి పక్కన 509 సర్వే నెంబర్‌లో 7 ఎకరాల 13 గుంటల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. కాగా పాఠశాల నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ భూమి అంతకు ముందు ఓ రైతుకు ప్రభుత్వం కేటాయించింది. దీంతో సదరు రైతు ఇట్టి భూమి విషయంలో కోర్టును ఆశ్రయించడంలో స్థల వివాదం కారణంగా పాఠశాల నిర్మాణం పనులు ప్రారంభ దశలోనే పిల్లర్ల వరకు కొంత పనులు జరిగి నిలిచిపోయాయి. స్థల వివాదం తొలగిపోవడంతో పాఠశాల నిర్మాణం పనులు తిరిగి ప్రారంభం కాగా మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ మీదుగా రుద్రూరు వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి జాతీయరహదారిగా మంజూరు చేసింది. దీంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు రహదారి విస్తరణ కోసం సర్వే పనులు జరిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా ప్రస్తుతం నిర్మిస్తున్న పాఠశాల భవనం వరకు రోడ్డు విస్తరణ జరుగుతుందనే కారణంగా పాఠశాల నిర్మాణం పనులకు మళ్ళీ రెండోసారి బ్రేక్ పడింది. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేయకుండానే చేతులెత్తేశాడు. పాఠశాల భవన నిర్మాణం పనులు చేపట్టడానికి ప్రభుత్వం ఫిబ్రవరి మాసంలో తిరిగి టెండర్లు నిర్వహించింది. నిర్మల్‌కుచెందిన ధరణి కన్‌స్ట్రక్షన్ టెండర్ తీసుకుని ఇటీవలే పాఠశాల నిర్మాణం పనులను చేపట్టారు. ఏళ్ళ తరబడి పాఠశాల నిర్మాణం పనులు వివిధ అడ్డంకుల కారణంగా ముందుకు సాగకపోగా, ప్రస్తుతం పనులను తీసుకున్న నూతన కాంట్రాక్టర్ త్వరగా పాఠశాల నిర్మాణం పనులను పూర్తిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● నాలుగేళ్లుగా సరంపల్లిలో కొనసాగుతున్న పాఠశాల

నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఎస్టీ గురుకుల పాఠశాల ప్రస్తుతం కామారెడ్డి పట్టణానికి సమీపంలోని సరంపల్లిలోని ఓ అద్దె భవనంలో నాలుగేళ్ళుగా కొనసాగుతోంది. పాఠశాలకు సొంత భవనం లేక మొదట్లో మండల కేంద్రంలోని ఓ అద్దె భవనంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. అద్దె భవనంలో సరైన వసతులు లేకపోవడంతో పాఠశాలను మండల కేంద్రం నుంచి మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలోని ఓ రేకుల షెడ్డులోనికి మార్చారు. అక్కడ సుమారు ఏడాది పాటు పాఠశాలను నిర్వహించారు. అక్కడ కూడా విద్యార్థులకు సరైన వసతులు లేని కారణంగా మండలంలో గురుకుల పాఠశాలకు అవసరమైన అన్ని వసతులతో కూడిన అద్దెభవనం లభించకపోవడంతో అధికారులు ఈ పాఠశాలను కామారెడ్డి పట్టణానికి సమీపంలోని సరంపల్లిలోని ఓ అద్దె భవనంలోకి మార్చారు. సుమారు నాలుగేళ్ళుగా ఈ పాఠశాల సారంపల్లిలోని అద్దె భవనంలోనే కొనసాగుతోంది. మండలానికి చెందిన ఈగురుకుల పాఠశాల కామారెడ్డి జిల్లాకేంద్రం సమీపంలో కొనసాగుతుండటంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ గురుకుల పాఠశాల భవననిర్మాణ పనులు పునఃప్రారంభమైనందున సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులను వేగవంతంగా జరిపేలా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ త్వరగా నిర్మాణం పనులు పూర్తిచేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మండలవాసులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యలపై సీఎంను కలిసిన భిక్కనూరు కాంప్లెక్స్ హెచ్ఎం



రాజగంగారెడ్డి సీఎంను సన్మానిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్23: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, భిక్కనూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజగంగారెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకరంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యా వ్యవస్థ మరింత మెరుగు పర్చాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని సీఎంకు తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో విన్నవించడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

భిక్కనూరు, జూన్23: మండలకేంద్రంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని సినిమా టాకీసు చౌరస్తాలో శ్యామాప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్యామాప్రసాద్‌ముఖర్జీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

భక్తి శ్రద్ధలతో నల్లపోచమ్మ పండుగ



నల్ల పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

మద్నూర్, జూన్ 23: మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నల్ల పోచమ్మపండుగను జరుపుకున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో రైతులు గ్రామస్తులు సామూహికంగా నల్లపోచమ్మ పండుగను జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆదివారం ఆయా కులసంఘాల ఆధ్వర్యంలో నల్లపోచమ్మ పండుగను జరుపుకున్నారు. అమ్మవారికి బోనాలను సమర్పించి మేకలను బలిఇచ్చారు. కేంద్రంలోని ఆయా కులసంఘాల వారు భాజా భజం త్రీలతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తమ పాడి పంటలు బాగుండాలని మంచి వర్షం పాడి పంటలు బాగా పండాలని రైతులు తల్లిని వేడుకున్నట్లు రైతులు తెలిపారు. అనవాయితీగా ప్రతీ ఏడాది పండుగ సందర్భంగానే నల్ల పోచమ్మ పండుగ జరుపుకుంటారు. ఈఏడాది వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో ముందు గానే పండుగను జరుపుకున్నట్లు రైతులు తెలిపారు.

ఆగని అడవి ఆక్రమణ

- ప్రతీ ఏటా పెరుగుతున్న అటవీభూమిసాగు
- దాడుల భయంతో అటువైపు వెళ్లని అటవీ అధికారులు


గాంధారి సమీపంలో అటవీభూమిని దున్నిసాగు చేసుకుంటున్న దృశ్యం


అడవి సంపదను నరికి వేస్తున్న దృశ్యం

గాంధారి,జూన్ 22:పచ్చనిచెట్లు ప్రగతికి మెట్లు ఇది అటవీశాఖ నినాదం అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. అడవుల నిర్మూలన వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వర్షాలు సకాలంలో పడడం లేదు. ఫలితంగా కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పోడు సాగుతో అసలు సాగు జరగని పరిస్థితి నెలకొంది.

● జోరుగా సాగు

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా అటవీ విస్తీర్ణం గాంధారి రేంజ్ పరిధిలోఉంది.అయితే గిరిజన తండాలు అత్యధికంగా ఉండడంతో ప్రతీ ఏటా అటవీ భూమి ఆక్రమణకు గురవుతుంది.ఇప్పటికే సుమారు 70శాతంకు పైగా భూమి ఆక్రమణకు గురైంది. ఈపరిస్థితులు ప్రతీఏటా పె రుగుతూనే ఉంది.ఈసంవత్సరం గతంలో సాగుచేసిన అటవీ భూమితో పాటు కొత్తగా అటవీభూమిని చాలాచోట్ల చెట్లను నరికి చదును చేసి సాగు చేస్తున్నారు. ఫలితంగా మండలంలో విస్తీర్ణం తగ్గిపోతుంది.

● అటవీభూమి కోసం తగాదాలు

ఇటీవల మండలంలో అటవీభూమి కోసం రెండు గ్రామాల ప్రజలు తరచుగా తగదాలు చేసుకుంటున్నారు. తామే అని సోమారం తండా, దుర్గం గ్రామాల ప్రజలు గొడవలకు దిగారు. యధేచ్చగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో దున్నుతూ చెట్లను మిషన్లతో నరుకుతూ సాగుకు పాల్పడ్డారు. అయిన అటవీ అధికారులు ఏమి చేయలేకపోయారు.

● పోడు పట్టాలతో పెరిగిన ఆక్రమణ

గత ప్రభుత్వం ఇష్టానుసారంగా పోడుపట్టాలను భారీగా ఇవ్వడంతో ఈ సారి అటవీ ఆక్రమణ మరింత పెరిగింది. పోడు పట్టాలు ఇవ్వడంతో నిబంధనలు పాటించకపోవడంతో అనర్హులు కూడా పట్టాలు పొందారు. పోడు పట్టాలను ఆసరాగా చేసుకుని మరింత అటవీభూమిని దర్జాగా దున్నుతున్నారు.కొందు దున్నుతేనే పోడుపట్టాలు ఇస్తారనే ఆశతో అటవీ భూమిని సాగుచేస్తున్నారు. పెద్దపెద్ద టేకు వృక్షాలను కూడా నరికి యధేచ్ఛగా సాగుకు పాల్పడితే అటగా అధికారులు చూసిచూడనట్లు ఉండడమే అటవీ ఆక్రమణకు ముఖ్యకారణంగా కనిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

'ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

పెద్దబజార్,జూన్ 23: కూలి పెంచాలి,భూమి పంచాలి, వ్యవసాయ కూలీలకు, పేదలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఓఫంక్షన్‌హాల్‌లో జరిగిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా హాజరై కార్మికులనుద్దేశించి మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు కనీస కూలీ రూ600 నిర్ణయించాలని, ప్రభుత్వం మిగులు భూములను పేదలకు పంచాలని అప్పుడే పేదలు వ్యవసాయ కూలీల బతుకులు బాగుపడతాయని అన్నారు.ప్రధానంగా పేద మహిళలందరికి నెలకు రూ.2500 జీవనభృతిని చెల్లిస్తామని, అర్హులైన నిరుపేదలందరికి రూ.4వేల పెన్షన్ చెల్లిస్తామని ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఇప్పటికే రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షలరుణాలను చేయడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. రైతుభరోసాను అమలు పర్చడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినప్పటికీ కూలీలకు ఇచ్చిన హామీలను సంవత్సరానికి రూ.12వేల వెంటనే అమలు జరపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రంలో ఉన్నటువంటి నరేంద్రమోదీ ప్రభుత్వం గతంలో వ్యవసాయ చట్టాలను మార్చి రైతులకు, పేదలకు నష్టం కలిగించే చర్యలు చేపట్టిందని అన్నారు. గతఎన్నికల్లో బీజేపీకి తాను నిర్దేశించుకున్న లక్ష్యానికన్న తక్కువ సీట్లను ప్రజలు ఇవ్వడం జరిగిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా పేదల సమస్యలు పట్టించుకోవాలని అర్హులైన పేదలందరికి స్థలాలను ఇచ్చి ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షల రూపాయలు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగ య్య, కార్యదర్శి వెంకట్రాములు, ఉపాధ్యక్షుడు బుర్రిప్రసాద్, జిల్లా కార్యదర్శి పెద్దివెంకట్రాము లు, అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, సీఐటీయూ నాయకులు చందర్‌గౌడ్, నూర్జహాన్, గంగాధరప్ప, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో ప్రభుత్వ అతిథి గృహానికి
కేటాయించిన స్థలం కబ్జా


గెస్ట్‌హౌస్ నిర్మాణ స్థలో మోరం పోసి ఆక్రమించుకున్న దృశ్యం

సిరికొండ జూన్ 23 : జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరాన గల సిరికొండ లో ప్రభుత్వ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని గ్రామానికి చెందిన ఒకరు ఇది నాదే స్థలమని మొరం పోసి ఆక్రమించుకున్నారు. అయిన రెవెన్యూపంచాయతీరాజ్,పోలీస్ అధికారులు గాని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కిమ్మనకుండా మిన్న కుండిపోయారు అనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. 2023 సెప్టెంబరు 13న ఆనాటి ఎమ్మెల్యే తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ 40 లక్షలో నిర్మించే ప్రభుత్వ అతిథి గృహానికి శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో కోల్పోయి కాంగ్రేస్ అధికారంలోకి రాగానే అతిథి గృహానికి కేటాయించిన స్థలాన్ని నాది అని గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకోవడం చర్చానీయాంశంగా మారింది. సిరికొండ నడిబొడ్డున పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా , కామారెడ్డి-భీమ్‌గల్ వెళ్లె ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న ఈ భూమి ప్రస్తుతంగా ధర వేలల్లో పలుకుతుంది. భూఆక్రమణకు పాల్పడిన వ్యక్తి పేరున పట్టాదారు పాస్ పుస్తకం ఉందని ఇదీ నాదే అంటూ స్థలంలో మొరం పోయడాన్ని పలువురు తప్పుబట్టుతున్నారు.ఎందుకంటే 2020-2021లో ఆనాడు ఆర్మూర్ ఎమ్మెల్యేగా పనిచేసిన బాజిరెడ్డి గోవర్ధన్ పోలీస్ స్టేషన్‌కు స్థల సేకరణలో భాగంగా ఈ భూమిని తీసుకుని డబ్బులను ఇప్పించారు. రోడ్డు ప్రక్కన గల భూమి కూడ పోలీస్ స్టేషన్‌కు ఇచ్చిన భూమిలో భాగమని స్థానికులు చెపుతున్నారు. ఒకవేల భూమికి సంబంధించిన పత్రాలుంటే ఎమ్మెల్యే హోదాలో బాజిరెడ్డి గోవర్ధన్ శంఖుస్థాపన చేసిన రోజు ఎందుకు అడ్డుకోలేదని స్థానికులు కొందరు సదరు వ్యక్తిని ప్రశ్నిస్తున్నారు. వాస్తంగా నీదే స్థలమయితే ఇన్ని రోజులు ఎందుకు మౌనంగా ఉండి పోయావేమిటని యువకులు ప్రశ్నిస్తున్నారు. భూమి తనదే అని ఆక్రమించుకున్న వ్యక్తికి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులే మద్దతుగా నిలిచారని సమాచారం. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు మౌనం వీడక పోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.వాస్తవానికి అది ఇనాం భూమి.గుడిలో పూజలు చేసి పంటలు పండించుకోవాలని ప్రభుత్వం ఇచ్చిన భూమి కావడం గమనార్హం. ఇనాం భూమి అయినప్పుడు ప్రభుత్వ అవసరాల కోసం తీసుకోవచ్చని అధికారులు చెపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే అతిథి గృహానికి కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. అయితే దానిని అనుకుని పాతదారి(రెవెన్యూ స్థలం ఉంది దానిని కూడ కబ్జా చేసుకోవాలనే దానితో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నాయకుల అండతో సదరు వ్యక్తి ఇలా చేస్తున్నట్లు సిరికొండలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

అది ప్రభుత్వ భూమే

తహసీల్దార్ అతిథి గృహానికి శంకుస్థాపన చేసిన భూమి ప్రభుత్వ భూమి అని సిరికొండ తహసల్దార్ రవీందర్ రావు అంగీకరించారు. పోలీస్ స్టేషన్‌కు ఇచ్చిన భూమిలో బాగంగా మిగిలిన భూమిని తెలుసని ఆయన అన్నారు. పౌరోహిత్యం చేసినందుకు పంట పండించుకోవాలని మాత్రమే ప్రభుత్వం ఆ భూమిని కేటాయించారని తనకున్న సమాచారం అని అన్నారు.మొరం పోసిన వ్యక్తి తనను సంప్రదిస్తే నీ వద్ద ఏమైన పత్రాలు, డాక్యుమెంట్లు ఉంటే తీసుకరా అని చెప్పానని అయిన ఆయన ఇంతవరకు నా వద్దకు రాలేదని తహసీల్దార్ చెప్పారు. ప్రభుత్వ భూమి అయితేనే ఆనాటి ఎమ్మెల్యే అతిథి గృహం నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తహసీల్దార్ చెప్పారు.

- రవీందర్ రావు,సిరికొండ తహసీల్దార్

'కామ్రేడ్ కృష్ణ వర్ధంతి సభను విజయవంతం చేయాలి'


అమీనాపూర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వేల్పూర్,జూన్23:మండలంలోని అమీనాపూర్‌లో డీవీకృష్ణ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథపార్టీ ఆధ్వర్యంలో ఆదివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రజాపంథ డివిజన్ నాయకులు రమేష్ మాట్లాడుతూ ఐదు దశబ్దాల పాటు విప్లవోద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన కామ్రెడ్ డివి.కృష్ణ రెండో వర్ధంతిని సభను విజయవంతం చేయాలని కోరారు. తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి నిజామాబాద్ జిల్లాలో విప్లవోద్యమానికి అడుగులు వేసిన దగ్గర నుంచి 22 జూన్ 2022 క్యాన్సర్‌తో తుది శ్వాస ఉద్యమం వైపు నిలబడి కృషి చేసిన ఆదర్శ కమ్యూనిస్టు విప్లవ యోధుడు కృష్ణ అన్నారు. సైద్ధాంతికథ రాజకీయ రంగాలన్నింటిని నిషితంగా పరిశీలన చేసి సరైన సిద్ధాంతం కోసం మొక్కవోని పోరాటం చేశారన్నారు. కృష్ణ తన విప్లవ జీవితంలో ప్రజాపంథ కోసం నిరంతరం పోరాడారన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో డివి.కృష్ణ స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేశామని, ఈనెల 26వ తేదీన ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కేంద్ర కమిటీ కార్యదర్శి ప్రదీప్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగరావు హాజరవుతారన్నారు. ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు కలిగోట రాజుగౌడ్, తలారి మల్లైన్న, ఆమోస్, సృజన్, జ్యోతి, ముత్తెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: డీవీ.కృష్ణ రెండో వర్ధంతిని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం పిలుపునిచ్చారు. ఆదివారం జక్రాన్‌పల్లిలో డివి.కృష్ణ వర్ధంతి సభను విజయవంతం చేయాలని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 26వ తేదీన డివి.కృష్ణ రెండో వర్ధంతి సభను నిర్వహిస్తున్నామని, ఈ వర్ధంతి సభకు ప్రతీఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలోసీపీఐ(ఎంఎల్),ఐఎఫ్‌టీయూ నాయకులు నజీర్, శ్రీనివాస్, అనిల్, లక్ష్మీ, నర్సయ్య, కార్మికులు లత, పద్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ రాష్ట్ర కార్యదర్శి కామ్రెడ్ డివి.కృష్ణవర్ధంతి సభ సందర్భంగా జూన్ 26న తేదీన నాల్కల్ రోడ్డు వద్ద స్థూపా ఆవిష్కరణను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మండల అధ్యక్షుడు సాయిరెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండలం నడ్కుడ గ్రామంలో డివి.కృష్ణ వర్ధంతి సభ వాల్‌పోస్టర్లను బీడీకార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో బీడీ కార్మికులు, తదితరులు ఉన్నారు.

మోపాల్:ఈనెల 26వ తేదీన డీవీకేఅన్న స్థూప ఆవిష్కరణ పోస్టర్లను మోపాల్ మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ నాయకులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రజా పంథ జిల్లా నాయకులు సాయాగౌడ్, దండుగంగమల్లు, గంగా రాం, మహేష్, వీరయ్య, తదితరులు ఉన్నారు.

సిరికొండ: విప్లవోద్యమాన్ని కాపాడుకోవడానికి ప్రాణ త్యాగం చేసిన త్యాగధనుడు చంద్ర కృష్ణమూర్తి అని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ కొనియాడారు. సిరికొండ మండలం తూంపల్లి గ్రామంలో జరిగిన ప్రతిఘటనోద్యమ దళపతి చంద్ర కృష్ణమూర్తి ఆలియాస్ ఎల్లన్న వర్ధంతి సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. ఈ సమావేశంలో దామోదర్, రమేష్, సాయరెడ్డి, ఈ రమేష్‌కిషోర్, బాల్‌రెడ్డి,ఎర్రన్న,సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి


నవీపేటలో మాట్లాడుతున్న జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి

నవీపేట,జూన్23: నవీపేటలోని ప్రధాన రహదారిపై రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి కోరారు. ఆదివారం ఆయన నవీపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవీపేట మీదుగా నిత్యం 40నుంచి 45వరకు వివిధ రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. దీని ద్వారా తరుచుగా రైల్వే గేటు మూసి ఉంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిత్యం హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నిర్మల్ జిల్లా బాసరలో ఉన్న సరస్వతి దేవి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్తుంటారని ఇదే మార్గంలో తరుచుగా రైల్వే గేటు మూసి ఉంచడంతో ప్రతిసారి రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఈ విషయంపై నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్‌లోని మాధవనగర్, అర్సపల్లిలలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కృషి చేసి మంజూరు చేయించారని, అదే విధంగా నవీపేటలో సైతం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేయిస్తూ నిధులు కేటాయించే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూరిబాబు, జనార్ధన్, జావీద్, సాయితేజ, ఒడ్డె రవి తదితరులున్నారు.

పోచారాన్ని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం శుభపరిణామం


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

వర్ని,జూన్23: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం శుభపరిణామం అని పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనిపూర్ రాజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వర్ని మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున పోచారం శ్రీనివాస్ రెడ్డిని తాము ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలు ఉన్నారని వారందరిని కలుపుకుని ముందుకు పోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ బాబా, సొసైటీ మాజీ చైర్మన్ నేమాని వీర్రాజు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాష్ట్ర మైనారిటీ నాయకులు అబ్దుల్ భారీ, మండల మైనారిటీ అధ్యక్షులు షంషోద్దీన్, తిప్పారం వెంకట్ గౌడ్, నాగేశ్వరరావు, గజ్జల సాయిలు, ప్రశాంత్, నారాగౌడ్, బంజ సాయిలు, లచ్చాగౌడ్, బషీర్, మొగులయ్య, అవేజ్, నర్సింలు, అనిల్, నిఖిల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదలతో..మురికి కాలువ


పొదలతో నిండిన మురికి కాలువ

మోస్రా,జూన్23: మండల కేంద్రంలో గల కోళ్లపారం వీధి అడవిని తలపిస్తున్న మురికి కాలువలు ఈ కాలనీ వాసులు గత కొన్ని నెలలుగా గ్రామపంచాయతీ అధికారుల చుట్టూ తిరిగి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఇప్పటికి మాకాలనీ మురికి కాలువలు శుభ్రపర్చడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. కాలువలు శుభ్రం చేయక కాలువల పక్కన చెట్లు పెరిగి అడవిని తలపిస్తోందన్నారు.ఈకాలనీలో ఎక్కువ చిన్నపిల్లలు ఉన్నారని, ఇక్కడ పాముల బెడద ఎక్కువ ఉందని వృద్ధులు,మహిళలు సైతం భయం గుప్పిట్లో బతుకుత ున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిపెట్టి శుభ్రత చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,జూన్23: పొతంగల్ మండల కేంద్రంలో శనివారం రాత్రి మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. పొతంగల్ మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పొతంగల్ ఆర్ఐ సాయిలు వాహనాలను పట్టుకుని తమకు అప్పగించారన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

డొంకేశ్వర్, జూన్ 23: డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామంలోని ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల చోరికి గురైన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రైతుల పంటలకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ లేకుండా పోతుందని, అర్ధరాత్రి ఎవరు లేని సమయాన్ని గుర్తించి దుండగులు దొంగతనానికి పాల్పడుతున్నారు. లిఫ్ట్ చైర్మన్ తెలిపిన వివరాల ప్రకారం 315హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా ఉండగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి 16క్వింటాళ్ల 80కిలోల బురువు గల ట్రాన్స్‌ఫార్మన్‌ను కిందపడేసి అందులో ఉన్న ఆయిల్ ఎత్తుకెళ్లారు. అందులో ఉన్న అల్యూమినియం వైరును ధ్వంసం చేసి 475లీటర్ల ఆయిల్‌ను గుర్తుతెలియని దుండుగులు చోరీ చేశారు. దీని విలువ సుమారు రూ.4లక్షల 50వేలు ఉంటుందని లిఫ్ట్ చైర్మ న్ బుర్రన్న తెలిపారు. కాగా ఈ ఘటనపై లిఫ్ట్ కమిటీ చైర్మన్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చైర్మన్ సుంకరి రాజు, వైస్‌చైర్మన్ జనార్ధన్, బండారి రవి, పుల్క సురేష్, తదితరులు పరిశీలించారు.


దత్తాపూర్‌లో విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసిన దృశ్యం

మెండోరలో ఘనంగా పస్కరాజుల పండుగ


మెండోరలో పస్కారాజులకు పూజలు చేస్తున్న ముదిరాజ్ కులస్థులు

మెండోర, జూన్23: మండల కేంద్రంలో పస్కారాజుల పండగను ముదిరాజ్ కులస్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్థులు ఖరీఫ్‌సీజన్‌లో మొదటగా పస్కారాజుల పండగ చేసిన తర్వాతే గ్రా మంలో ఉన్న దేవతల పండగలు గ్రామస్థులు నిర్వహిస్తారు. ముదిరాజ్ కులస్థులు జీవనాధారం పండ్ల పెంపకంతో జీవనం సాగిస్తుండడంతో నాటి రాజులు ముదిరాజ్ కులస్థులే గ్రామంలో ఉన్న దేవతలకు పండ్లను సమర్పించే అనవాయితీ తీసుకున్నారు. అందులో భాగంగా ముదిరాజ కులస్థులు గ్రామంలో ఉన్న పస్కారాజులకు నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించు కున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నోట్ బుక్‌ల పంపిణీ

ఆర్మూర్‌టౌన్, జూన్23: పట్టణంలోని లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రీయ యువజన సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉచిత నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. క్షత్రీయ సమాజ్‌కు చెందిన విద్యార్థులకు ఉచిత నోట్‌పుస్తకాలను అందజేస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షత్రీయ యువజన సమాజ్ అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి నీరజ్, సభ్యులు, పాల్గొన్నారు.

రహదారిపై ఏర్పడ్డ గుంతను పూడ్చివేయాలి


నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు

నవీపేట,జూన్23: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రహదారిపై ఏర్పడ్డ గుంతను వెంటనే పూడ్చి వేయాలని స్థానికులు కోరారు. నవీపేట నుండి రాంపూర్ వెళ్లే రహదారిపై పెద్ద సైజులో గుంత ఏర్పడడంతో వర్షపు నీటితో పాటు మురికి నీరు నిలిచి ఉంటుందని, దీంతో రోడ్డుపై వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. రహదారిపై నూతనంగా కల్వర్టు నిర్మించాలని వారు కోరారు.ఈ విషయంపై గ్రామ పంచాయతీ అధికారులతో పాటు ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదని వారు పేర్కొన్నారు. ఇప్పటికైన వెంటనే రోడ్డుపై ఉన్నగుంతను పూడ్చి వేయడంతో పాటు త్వరలో నూతనంగా కల్వర్టును నిర్మించే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


మోస్రాలో కాంగ్రెస్ నాయకుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

మోస్రా,జూన్23: మోస్రా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తోట రాజు తల్లి మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ బాధ్యులు ఏనుగు రవీందర్ రెడ్డి తోట రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మోస్రా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు నందు పటేల్, ప్రతాప్ సింగ్, మేక వీర్రాజు, హరి నారాయణ, అశోక్, బొజ్జ శ్రీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం విగ్రహాల ఊరేగింపు

మోపాల్, జూన్ 23:మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ దేవతలను వర్షాల కోసం ఊరేగింపు నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గ్రామ దేవతలను ఊరిపొలిమెర నుండి ఆలయాల వరకు ఊరేగింపు నిర్వహించారు. గంగ నుండి తీసుకువచ్చిన నీటితో జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతుల, ప్రజలు గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి పెద్దలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

డొంకేశ్వర్, జూన్ 23: డొంకేశ్వర్ మండలం గాదేపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సింగిడి నర్సారెడ్డి రోజు ఇంటి నుంచి గేదెను మేతకు పంపించే క్రమంలో గ్రామంలో ఉన్న జంగం మోహన్ ఇంటి వద్ద 16కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ హెర్త్ వైరు తగిలి గేదె మృతి చెందింది. సుమారు రూ.లక్ష విలువ చేసే గేదెను కోల్పోయానని రైతు వాపోయాడు.

అప్పారావుకు నివాళులర్పించిన కళాపరిషత్ సభ్యులు

ఖిల్లా, జూన్ 23:పౌరాణిక రంగస్థలానికి సీవీ అప్పారావు ఎంతో కృషి చేశారని శ్రీపాద నాటక కళాపరిషత్ సభ్యులు అన్నారు. ఆయన ఆకస్మికంగా ఈనెల 19న మృతి చెందడం పట్ల ఆదివారం కార్యాలయంలో సంతాపం ప్రకటించారు. ఆయన జిల్లాకే కాదు ఇతర ప్రాంతాల్లో కూడా రంగస్థలంపై పేరు తీసుకువచ్చారని తెలిపా రు. ఈ సమావేశంలో శ్రీపాద కుమారశర్మ, స్నేహమయి ప్రకాశ్, రామసూర్య ప్రకాశ్‌రావు, సీతారామచంద్రమూర్తి, రాజ్‌కుమార్ సుబేదార్, వీపీ చందన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండితులు

డిచ్‌పల్లి,జూన్ 23: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ స్కూల్ అసిస్టెంట్ లుగా పదోన్నత కల్పించినందుకు ధన్యవాదలు తెలిపినట్లు రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ల , ప్రధాన కార్యదర్శి క్రాంతి కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భాషా పండితులకు భవిష్యత్తులో పదోన్నతులు వచ్చేవి కావని రేవంత్ సర్కార్ తమకు పదోన్నతులు కల్పించడంపై ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు శర్మ, జమీల్, హమీద్ ఖాన్, పాల్గొన్నారు

టీయూలో విద్యార్థుల ఆందోళన

డిచ్‌పల్లి,జూన్ 23: హాస్టల్‌లో నాసిరకం భోజనం పెడుతున్నారని రాత్రి విద్యార్థులు ఆందోళనకు దిగారు. మినిమేకర్ కూరగాయాల్లో నీటి శాతమే అధికంగా ఉందని నాణ్యత పాటించడం లేదని విద్యార్థులు భోజనం చేయకుండా నిరసన తెలిపారు. వర్సిటీ అధికారులు వెంటనే మెస్ నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నృత్యకళాకారులకు నంది అవార్డులు

కమ్మర్‌పల్లి, జూన్ 23: మండల కేంద్రంలోని శ్రీసరమేశ్వర నృత్యకళానిలయంలో కూచిపుడి నృత్యకళాకారులను నందిఅవార్డు వరించాయి. హైదరాబాద్ తెలంగాణ సరస్వతి పరిషత్ వేదికగా కీర్తి ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన నృత్యపోటీల్లో పాల్గొన్న కమ్మర్‌పల్లి శ్రీసరమేశ్వర నృత్యకళానిలయం విద్యార్థినిలు విశాలినిగౌడ్, వి వాణి, బి శ్రీలాస్య, ఎస్ హసిని, ఎస్ అభిజ్ఞ, ఏ పూర్విత, ఎస్ వన్షిక, కే రిషిత పాల్గొనగా వారి అసమాన నృత్యప్రదర్శకు ఈ అవార్డులు లభించాయి. కూచిపుడి నాట్యగురువు గంటా శిరీషా రాజశేఖర్ వద్ద ఈ విద్యార్థులు తర్ఫీదు పొందుతున్నారు. వీరి ప్రతిభకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు తోపాటు నంది అవార్డులు కైవశం చేసుకున్నట్లు నాట్యాచార్యులు కూచిపుడి నాట్యగురువు గంటా శిరీషా రాజశేఖర్ తెలిపారు. తమ పిల్లకు నంది అవార్డులు వరించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అవార్డుల ప్రదానంలో తెలంగాణ సరస్వతి పరిషత్ వేదికగా కీర్తి ఆర్ట్స్ అకాడమి ఆర్గనైజర్ బిందు లీమ, ముఖ్యఅతిదిగా డాక్టర్ వేను గోపాలచారి హాజరైనట్లు తెలిపారు.

మామతో కలిసి భర్తను కడతేర్చిన భార్య

- వేధింపులు భరించలేకే హత్య చేసినట్లు అంగీకారం
- అదృశ్యంగా నమోదైన కేసులో వ్యక్తి హత్య


ఇంటి పరిసరాల్లో గుంతను తవ్వి పరిశీలిస్తున్న సీఐ కృష్ణ
మృతుడు రాములు (ఫైల్)

బాన్సువాడ టౌన్, జూన్ 23: మామతో కలిసి కట్టుకున్న భర్తను హత్య చేసిన భార్య ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటన కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాన్సువాడ సీఐ మున్నూరు కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కుకుట్ల రామగొండ అలియాస్ రాములు(40) గ్రామంలో కూలి పనిచేస్తూ భార్య, ముగ్గురు పిల్లలు, తండ్రితో కలిసి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 9న ఇంటినుంచి పని చేసేందుకు హైదరాబాదుకు వెళ్తున్నానని చెప్పినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అదే గ్రామంలో ఉంటున్న మృతుడి బావ శ్రీనివాస్ రామగొండకు ఫోన్‌చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో ఎక్కడికి వెళ్లాడని కుటుంబ సభ్యులను ప్రశ్నించాడు. పని చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్లినట్లు వారు తెలిపారు. ప్రతీరోజు క్రమం తప్పకుండా బావమరిదికి ఫోన్‌చేసినా లాభం లేకపోవడంతో అనుమానం వచ్చిన శ్రీనివాస్ ఈనెల 16న రామగొండ భార్య మంజుల, తండ్రి నారాయణలను నిలదీశాడు. తన భర్త రామగొండ హైదరాబాద్‌కు పని చేసేందుకు వెళ్తున్నానని చెప్పి కనబడకుండా పోవడంతో 16వ తేదీన భార్య మంజుల బాన్సువాడ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు వ్యక్తి అదృశ్యం కింద కేసునమోదు చేశారు. రామగొండ భార్య, తండ్రి ప్రవర్తనపై అనుమానం కలిగిన బావ శ్రీనివాస్ శనివారం వారిద్దరిని గట్టిగా నిలదీయడంతో రామగొండను చంపింది తామేనని అంగీకరించారు. రామగొండ మద్యానికి బానిసై తరచుగా భార్యను, తండ్రిని కొట్టడం చేస్తుండడంతో విసుగుచెంది అతనిని చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 9న మద్యం తాగి వచ్చి, తిని పడుకున్నాక, మూత్ర విసర్జనకు లేచిన సమయంలో రామగొండను వెనక నుంచి తండ్రి, భార్య గొడ్డలితో మెడపై నరికి దారుణంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఇంటి వెనక భాగంలో ఉన్న సెప్టిక్ ట్యాంకులో పడేశారు. రెండు రోజుల తర్వాత సెప్టిక్ ట్యాంకులో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి పక్కనే గంగవ్వ అనే మహిళకు చెందిన పాడుబడిన ఇంటి ఆవరణలో గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చి వేశారు. మృతుడి బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం సీఐ మున్నూరు కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి, అక్కడే శవ పంచనామా, శవ పరీక్ష నిర్వహించి మృతదేహాన్ని అక్కబావలకు అప్పగించారు. మామతో కలిసి కట్టుకున్న భర్తను కడతేర్చిన భార్య మంజుల, మృతుడి తండ్రి నారాయణను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

‘బస్టాండ్‌లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి’


బస్టాండ్‌లో ప్రయాణీకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మద్నూర్, జూన్ 23 : పట్టణంలోని పాత బస్టాండ్‌లో పోలీసుల ఆధ్వర్యంలో ప్రయాణీకులకు దొంగతనాలపై అవగాహన కల్పించారు. ఇటీవల దొంగతనాలు చేసేవారు మహిళలను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతు న్నారని, బస్సుల్లో ఎక్కేటప్పుడు దిగేటప్పుడు చుట్టూపక్కల వారిని ప్రయాణికులు గమనించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటామని బస్టాండ్‌లో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులు గుర్తించినట్లయితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని వారు సూచించారు. దొంగతనాలను నివారించడానికి తెలంగాణ ప్రభుత్వం పోలీసులను అప్రమత్తం చేసిందని బస్టాండ్‌లో ప్రయాణీకుల వద్ద దొంగతనాలు జరుగకుండా అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా బస్టాండ్‌లో మహిళలను టార్గెట్ చేసి దొంగత నాలకు పాల్పడుతున్న వారిని ఇటీవల గుర్తించామని ప్రయాణీకుల దృష్టికి వచ్చినట్లయితే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డిటౌన్, జూన్ 23: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఆదివారం జిల్లా బీజేపీ నాయకులు ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏక్‌దేశ్ దో నిశాన్, దో ప్రధాన్, దో విధాన్ నహీ చలేగా అంటూ సమైక్యభారతం కోసం ప్రాణాలను తృణపాయంగా త్యజించిన భారతమాత ముద్దుబిడ్డ శ్యామాప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. దేశ విభజన అనంతరం దేశంలో జరుగుతున్న అరాచకపాలన చూసి ఓర్వలేక తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి భారతీయ జనసంఘ్ ప్రారంభించి జాతీయవాద రాజకీయానికి అంకురార్పణ చేశారని, ఒక రాష్ట్రానికి ప్రత్యేక జెండా, రెండు జాతీయ పతకాలు ఉండటాన్ని సహించలేమని అందరికీ ఒకే విధమైన పౌరస్మృతి ఉండాలని నినదించి ఆర్టికల్ 370 వెంటనే రద్దుచేయాలని ముందుకు సాగడన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు భరత్, కౌన్సిలర్‌లు శ్రీనివాస్, నరేందర్, నాయకులు వేణు, వెంకట్, ప్రతాప్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

బీబీపేట: దేశసమగ్రత, స్వేచ్ఛకోసం పనిచేసిన జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బీజేపీ మండల శాఖ అధ్వ ర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రంజిత్‌గౌడ్ మాట్లాడుతూ దేశసార్వభౌమా ధికారం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్, పోసుశివ, భరత్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్‌దివాస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూపాల్‌రెడ్డి, కుంట లక్ష్మారెడ్డి, రవీందర్, నరేందర్‌రెడ్డి, జగదీష్, అంజిరెడ్డి, కంది మనోజ్ కుమార్, రాజేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను ఆదివారం పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు సంజయ్‌పటేల్ మాట్లాడుతూ భారతీయ జనసంఘ్ పార్టీ ఏర్పడడానికి శ్యాంప్రసాద్ ముఖర్జీ ఎనలేని సేవలు చేశారని తెలిపారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ స్థాపన చేసిన భారతీయ జనసంఘ్ పార్టీ నేడు భారతీయ జనతా పార్టీగా మారిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు చిప్ప రమేష్, ప్రేమ్‌సింగ్, కిషోర్ పంతు లు, తానాజీ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన పోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశ సమైక్యతకు, సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడని కొనియాడారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు తుకారాం, నాయకులు కృష్ణ పటేల్, తుల సంతోష్, యాదవ్‌రావు, బాలకిషన్, అజయ్ తమ్మేవార్ పాల్గొన్నారు.


మద్నూర్‌లో ముఖర్జీ వర్ధంతిలో కార్యకర్తలు

పల్లె దవాఖానాకు నీటి కొరత


వ్యవసాయ బోరు మోటార్ వద్ద నుంచి నీటిని నింపుతున్న సిబ్బంది

ఎల్లారెడ్డి, జూన్ 23 : గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులకు ఔషధాలు అందించడానికి గత ప్రభుత్వం ఒక్కో పల్లె దవాఖానాలను రూ.23 లక్షలతో నిర్మించింది. కాని నీటికోసం బోరు మోటారు ఏర్పాటు చేయలేదు. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో 11వ వార్డులో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానాలలో నీటి సమస్య ఉండడంతో పక్కన వ్యవసాయ పొలం వద్ద ఉన్న బోరు మోటారు నుంచి పైప్ ద్వారా నీటిని సంపులో నింపుకుంటున్నారు. అధికారులు స్పందించి పల్లె దవాఖానాలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించాలని వైద్యసిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగులు, స్థానికులు కోరుతున్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత


రహదారిపై గుంతలు పూడ్చి వేస్తున్న దృశ్యం

పెద్ద కొడప్‌గల్, జూన్ 23: జుక్కల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణతో పాటు, జుక్కల్ నుంచి గుండూర్ వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ తెలిపారు. జుక్కల్ బస్టాండ్ ప్రాంతంలో ఏర్పడిన గుంతల తో ప్రయాణానికి తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయని మండల ప్రజలు విన్నవించగా, ఈ విషయం జుక్కల్ ఎమ్మెల్యే కాంతారావ్ దృష్టికి తీసుకు వెళ్లి రహ దారి మరమ్మతు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో పాటుగానే త్వర లోనే జుక్కల్ బస్టాండ్ మరమ్మతు పనులు చేయిస్తామని తెలిపారు. కార్య క్రమంలో మాజీ ఎంపీటీసీ ఇమ్రాన్, అనిల్‌సేట్, అస్పత్ వార్ అరుణ్, గాయ క్వాడ్ విఠల్ పాల్గొన్నారు.

నిజాంసాగర్ నీటిని విడుదల చేయడం హర్షణీయం


- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్కశ్రీనివాస్

నసురుల్లాబాద్, జూన్ 23: నిజాంసాగర్ ఆయకట్టు రైతాంగం కోసం నిజాంసాగర్ నీటిని విడుదల చేయడం హర్షణీయమని మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ పెర్కశ్రీనివాస్ అన్నారు. ఆదివారం నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్‌క్యాంప్‌లో రైతులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నసురుల్లాబాద్ మండలంలోని రైతులు నారుమల్లు వేసుకున్నారని, వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న మాజీస్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నిజాంసాగర్ నీటిని విడుదల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు నిజాంసాగర్ నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్యక్రమం లో ఎంపీపీ పాల్త్య విఠల్, నసురు ల్లాబాద్ సొసైటీ చైర్మన్ గంగారాం, మిర్జాపూర్ మాజీ సొసైటీ చైర్మన్ మారుతి పటేల్, ప్రతాప్‌సింగ్, మాజీ ఎంపీటీసీ కంది మల్లేష్, వనం వెంకటేశ్వరరావు, పురం వెంకటరమణ, సాయిరాం యాదవ్, జగన్, పెర్కరాజు, ఖలీల్, చుంచు, సాయిలు పాల్గొన్నారు.


అంకోల్ క్యాంప్‌లో మాట్లాడుతున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : జుక్కల్ ఎమ్మెల్యే

నిజాంసాగర్, జూన్ 23 :మండలంలోని హసన్‌పల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు హాజరై మాట్లాడారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత గ్రామానికి ఆయా అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు మంజూరు చేశానని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరికల పట్ల కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. పార్టీ గెలుపు కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పలువురు సన్మానించారు.


హసన్‌పల్లిలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

మిషన్‌భగీరథ లీకేజీలతో ప్రజలకు ఇబ్బందులు

సదాశివనగర్, జూన్ 23:రోజుల వ్యవధిలోనే పలుసార్లు మిషన్‌భగీరథ లీకేజీలు కావడం వల్ల చిరువ్యాపారులు నష్టపోతున్నారు. చిరువ్యాపారులు చిన్నకారు రైతులు అనునిత్యం నష్టపోతునే ఉన్నా శాశ్వత పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోకపోవడం బాధకరమని పలువురు వాపోతున్నారు. పద్మాజీవాడి ఎక్స్‌రోడ్ వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ వల్ల గ్రామాలకు నీటిసరాఫరా నిలిచిపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న చిరు వ్యాపారులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. అధికారులు లీకేజీలు సరి చేసినప్పటికీ ఒకరోజులోనే మళ్లీ లీకేజీలు కావడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆ ప్రాంతప్రజలు బాధను వ్యక్తం చేస్తున్నారు. దగ్గి నుంచి పద్మాజీవాడి నుంచి మల్లుపేట శివారు వరకు నిత్యం లీకేజీలు కావడంతో ఆ ప్రాంతంలో పంటలు పండించుకునే రైతులకు కూడా తీవ్రఇబ్బందులు కలుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు లీకేజీలు కాకుండా శాశ్వత పరిష్కారం వైపు దృష్టి మళ్లించి ఈ ప్రకారం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


పద్మాజీవాడి ఎక్స్‌రోడ్ వద్ద తవ్విన భారీ గుంత

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బాన్సువాడటౌన్ , జూన్ 23 : ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బాన్సువాడ పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ పట్టణంలోని హన్మాన్‌గల్లీకి చెందిన మాంటిగె రమేశ్ (22) సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవించేవాడు. ఆదివారం ఉదయం ఆయన ఉరివేసుకుని చనిపోయాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అన్న రేనుకుమార్ మాత్రం తన తమ్ముడి మృతిపై అనుమానం ఉన్నట్లు పిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదుపు తప్పి బోల్తా పడిన లారీ

పెద్ద కొడప్‌గల్, జూన్ 23: మండలంలోని బేగంపూర్ శివారులో 161వ జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి దెగ్లూర్‌వైపు వెళ్తున్న లారీ బేగంపూర్ శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. రహదారి భద్రతసిబ్బంది ఘటన స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

పెద్దకొడప్‌గల్ ఎస్ఐకి సేవా పథకం

పెద్ద కొడప్‌గల్, జూన్ 23: కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ ఎస్ఐ కోనారెడ్డి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేసిన ఉత్తమసేవలకు గాను సేవా పథకం లభించింది. ఈ పథకం కింద కామారెడ్డి జిల్లా నుంచి 9మంది పోలీసులు ఎంపిక కాగా, ఇందులో పెద్దకొడప్‌గల్ ఎస్ఐ కోనారెడ్డి ఉండడం విశేషం. ఉద్యోగ జీవిత కాలంలో పలు సేవలు చేసినందుకు గాను ఇలా అవార్డులు రావడం సంతోషంగా ఉంద ని, తన బాధ్యతమరింత పెరిగిందని ఎస్ఐ కోనా రెడ్డి తెలిపారు.

ఘనంగా పుణ్యస్మృతి దివాస్


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డిటౌన్, జూన్ 23: జిల్లా కేంద్రంలోని ఓంశాంతికాలనీలో ఆదివారం 59వ పుణ్యస్మృతి దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్‌చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లా డుతూ జీవనశైలిని ఎలా మార్చుకోవాలో, వచ్చిన సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలో చెప్పడం ఓంశాంతి ముఖ్యఉద్దేశమన్నారు. కార్యక్రమం లో కౌన్సిలర్‌లు పాతశివకృష్ణమూర్తి, మాజీకౌన్సిలర్ సుధాకర్, బ్రహ్మకుమారి లు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


పాలాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, జూన్ 23:కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ దశాబ్దాల తరబడి కలగా మిగిలిపోయిన భాషా పండిట్ల, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడ్ చేయడం, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్రవ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకర్‌రెడ్డి, పర్వతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జడ్పీటీసీ నారెడ్డిమోహన్‌రెడ్డి అన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం హర్షనీయమన్నారు. సీఎం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మాగౌడ్, నేతలు మహేందర్‌రెడ్డి, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, రెడ్డినాయక్, నర్సింలు, రంజిత్, పోచయ్య, శంకర్, శ్యామ్,అనిఫ్, ప్రవీణ్, క్రిష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు లకు 2లక్షల రుణమాఫీ చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నెహ్రూచౌరస్తా వద్ద రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. రైతులను కాంగ్రెస్ పార్టీ అన్నివిధాల ఆదుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

రామారెడ్డి, జూన్ 23: మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా లింగం, కార్యదర్శిగా రాజశేఖర్, క్యాషియర్‌గా రమేష్, కార్యవర్గ సభ్యులుగా రాజయ్య, గోపాల్, బాలయ్య, నర్సింలు, పెద్దరాజయ్య, చిన్నలింగం, కిషన్, రాజనర్సయ్యలను ఎన్నుకున్నారు. మాజీ రాష్ట్రకార్యదర్శి వెంకటరాములు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తిరాలి లక్ష్మీ పాల్గొన్నారు.

బంజారశక్తి మూమెంట్ సర్వసభ్య జిల్లా అధ్యక్షుడిగా రాంవిలాస్

గాంధారి, జూన్ 23: బంజారశక్తి మూమెంట్ సర్వసభ్య జిల్లా అధ్యక్షుడిగా రాంవిలాస్ రాథోడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవసమాజ నిర్మాణంలో యువత ముందుకు రావాలని, సేవాలాల్ మహారాజ్ యొక్క అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ సందర్భంగా తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు రవినాయక్, సంతోష్‌నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బీర్కూర్‌లో 35.8 మి. మీ. వర్షపాతం నమోదు

బీర్కూర్, జూన్ 23: బీర్కూర్‌లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి 35.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇప్ప టివరకు పెద్ద వర్షాలు కురియలేదు. ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. భారీ వర్షాలు కురిపించాలని రైతులు వరుణ దేవుడిని ప్రార్థిస్తున్నారు.

రైతులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

బాన్సువాడటౌన్ , జూన్ 23 : పేద రైతులపై దాడి చేసి వారి భూములను కబ్జా చేసిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గాయపడిన బాధితులను పరామర్శించారు. నసురుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలో పేదల భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని , మా భూమి మాకు ఇమ్మని అడిగితే పేదలపై దాడి చేయడం భావ్యం కాదన్నారు. పోలీసులు ఈ దాడిని తీవ్రంగా పరిగణించాలని , పేదల భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పేదలకు ఎలాంటి అన్యాయం జరిగినా సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కోర్ కమిటీ సభ్యులు రవీందర్, మధు, శంకర్, రాజు తదితరులున్నారు.


ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న దృశ్యం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	- ఓసీ
దర్శన్	- మహారాజ
ప్రియా 70	- ఓంజీ

బాన్సువాడ	
మహేశ్వరి	- ఓంజీ
వెంకటేశ్వర	- నింద

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

